# బాడుగ

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) చిన్న కథల పోటీలో
రు. 200 గెలుచుకున్న రచన

— యర్రమిల్లి
విజయలక్ష్మి

మిట్ట మధ్యాహ్నం రెండు గంటల సమయం. ఎండ మండి పోతోంది. శనివారం కావడం వల్ల ఈ రోజు రెండు గంటలకే ఆఫీసయిపోయింది. నా కొలీగ్స్ అందరూ వెహికల్స్ మీద ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

'ఇంత ఎండలో ఎలా వెళ్ళడం ఇంటికి! ఈ ఏరియాలో రిక్షాలు కూడా అంతగా దొరకవు ... సెంటర్ దాకా పోవాలి...!' అసలే ఆఫీసు పనితో సగం అలిసిపోయి వున్నాను. పైన ఎండ తీవ్రత ఒకటి ... 'ఏదన్నా రిక్షా దొరికితే బాగుం డును. ఎంత అడిగితే అంత ఇచ్చి వెళ్ళి పోవచ్చు.'

ఎండలో తెగించి అడుగు ముందుకు వెయ్యలేక - మా ఆఫీసు కెదురుగా వున్న చెట్టు కింద రిక్షాకోసం ఎదురుచూస్తూ నుంచున్నాను.

ఇంతలో దూరం నుండి రిక్షా గంట వినిపించింది. 'ఏదో రిక్షా వస్తున్నట్లుంది. ఖాళీగానే వున్నట్లుంది. ఫర్వాలేదు ... పిచ్చయ్య లాగుతున్నాడే ... అవునతనే ... అయితే బాధే లేదు... బేరం ఆడవలసిన అవసరం వుండదు. రోజూ ఇచ్చే దాని కంటే ఓ పావలో, అర్థో ఎక్కువిస్తే సరి ... నిప్పులు చెరిగే ఎండలో రిక్షా కోసం ఎదురుచూస్తూ చెట్టు కింద నిలబడే బాధ తప్పింది' అనుకుంటుండగానే రిక్షాను దగ్గరగా తెచ్చి ఆపాడు పిచ్చయ్య.

టాపు వేసి - పై గుడ్డతో సీటు శుభ్రంగా తుడిచి "ఎక్కండమ్మా ...! ఎండ మండిపోతంది..." అన్నాడు.

"అమ్మయ్య..." అనుకుంటూ రిక్షా ఎక్కి సుఖంగా కూర్చున్నాను.

పిచ్చయ్య మెల్లిగా తొక్కుతున్నాడు రిక్షా. రిక్షా మెల్లిగా పోవడమే నాకిష్టం. అది వాడికి తెలుసు. అందుకే చెప్ప నక్కర లేకుండానే చిన్నగా తీసుకువెళ్తు తున్నాడు.

తరచు నేను పిచ్చయ్య రిక్షాలోనే ఆఫీసుకు వచ్చి పోతుంటాను. ఇల్లు దూరం కావడం వల్ల ఆఫీసుకు రోజూ రిక్షాలోనే వస్తుంటాను.

చెమటలు కక్కుతూ రిక్షా తొక్కు తున్నాడు పిచ్చయ్య. ఒంటి మీద మాసిన చినుగుల బనీను తడిసి ముద్దైంది. ఎండి ముడతలుపడి మోడులా వున్న బక్క చిక్కిన శరీరం ... విసిరిసిరి కొడుతున్న వడగాలిలో ఊపిరాడక నీరసంగా లాగు తున్నాడు. ఉదయం నుండీ ఎందర్ని మోశాడో పాపం! కానీ తప్పదు. కాయ కష్టపు బతుకులు ... సాయంత్రం దాకా బాడుగులు దొరికితేనే వాడికీ, వాడి కుటుంబానికీ ఇంత తిండి.

ఆఫీసు నుండి ఇంటికి కానీ - ఇంటి నుండి ఆఫీసుకు కానీ రెండు రూపా యిలు బాడుగిస్తాను నేను. కానీ ఇప్పటి పిచ్చయ్య పరిస్థితిని చూస్తుంటే నాకు చాలా జాలి వేసింది. వాడి సంగతి నాకు తెలుసు. అందరు రిక్షా వాళ్ళలా కాదు. ఎంతిస్తే అంత పుచ్చుకుంటాడు. చేతిలో ఎన్ని పైసలు పడిందీ కూడా చూసు కోడు. ఇంత ఎండలో నడిరోడ్డు మీద వెయిటింగ్ బాధ తప్పింది. ఇదే ఇంకో రిక్షా వాడైతే ఎంత బేరమాడినా నాలు గైదు రూపాయిలైనా తీసుకుంటాడీ ఎండలో. పాపం ... వీడికే ఆ డబ్బిస్తే సరి... తక్కువిస్తే ఊరుకోడు. పోనీ అంతగా అడిగితే ఇంకో పావలో, అర్థో ఇవ్వచ్చులే' అనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూనే చాచిన వాడి చేతిలో రెండు రూపాయిల నోటు పెట్టాను. మాట్లాడకుండా దాన్నే అందుకుంటున్న అతని ముఖంలోకి పరి శీలనగా చూశాను.

ఆకలి - అలసట స్పష్టమవుతున్న ఆ చూపుల్లో నవ్వునవ్వు లీలగా కనిపిస్తోంది.



పిచ్చయ్య మెల్లిగా రిక్షా ఆపి — ముఖాన కారుతున్న చెమట తల గుడ్డతో తుడుచుకుంటూ నిలబడ్డాడు. నేను హాండ్ బ్యాంగ్ తీశాను ... ఆ క్షణం దాకా నాలుగు రూపాయిలిద్దామను కున్నాను. ఎందుకో నా చేతికి రెండు రూపాయిల నోటే వచ్చింది.

'అసలు పిచ్చయ్యకు ఎప్పుడూ నేనిచ్చే దంతే. రోజూ ఎక్కే రిక్షాకి ఈ రోజు ఎక్కువిస్తే రేపూ అంతే అడుగుతాడు.

'నా ఆలోచనను పిచ్చయ్య పసి కట్టాడా...! ఆ ... అయినా అడిగితే ఇవ్వచ్చులే ... అడక్కుండానే ఇస్తే లోకువ కదూ...'

తల గుడ్డ మడతలో రెండు రూపా యిల నోటు భద్రపరుచుకుంటూ 'ఎండ మండిపోతంది ... లోనకెళ్లండమ్మా ...!' అంటూనే రిక్షా వెనక్కు తిప్పుకుని గంట మోగించుకుంటూ వెళ్ళిపోయాడు పిచ్చయ్య.

*